

మంత్రికి అంగన్వాడీ టీచర్లు సత్కారం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు నియోజకవర్గంలోని 319 మంది అంగన్వాడీ టీచర్లకు రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి స్మార్ట్ మొబైల్స్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 17 మినీ అంగన్వాడీ సెంటర్లను మెయిన్ అంగన్వాడీ సెంటర్లుగా ప్రమోట్ చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో సుమారు నాలుగు వేల సెంటర్లను మెయిన్ సెంటర్లుగా ప్రమోట్ చేసినట్లు తెలిపారు. టీచర్లకు, వర్కర్లకు అంగన్వాడీ సిబ్బందికి రిటైర్ అనంతరం గ్రాడ్యూటీ సుమారు రూ.లక్ష అందిస్తున్నట్లు చెప్పారు. ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న మినీ అంగన్వాడీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా ప్రమోట్ చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. తద్వారా సెంటర్లకు టీచర్‌తో పాటు ఒక వర్కర్ కూడా వస్తుందన్నారు. మునుపెన్నడూ లేనివిధంగా అంగన్వాడీ వర్కర్లు, టీచర్లు చనిపోతే కూటమి ప్రభుత్వం మట్టి ఖర్చులు రూ.15 వేలు అందిస్తుందన్నారు. మంత్రికి అంగన్వాడీ వర్కర్లు, సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు.

'ఉపాధి' ఊపిరి తీసే..!

ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసిన మోడీ సర్కార్

మహాత్మా గాంధీ పేరు తొలగింపు.. అసలు లక్ష్యానికి తూట్లు

రెండు జిల్లాల్లో 4.71 లక్షల ఉపాధి శ్రామికులపై ప్రభావం

ఏడాది పొడవునా ఉపాధి పనులకు తిలోదకాలు

డిమాండ్‌ను బట్టి పనికి రాంరాం.. అవసరాన్ని బట్టే పనులు

కేంద్రం ఇచ్చే 90 శాతం నిధులను 60 శాతానికి తగ్గింపు

ప్రజల్లో పెల్లుబుకుతున్న ఆగ్రహావేశాలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

మోడీ సర్కార్ ఉపాధి హామీ చట్టం ఊపిరి తీసేసింది. మార్పుల పేరుతో ఉపాధి హామీ చట్టం లక్ష్యానికి పూర్తిగా తూట్లు పొడిచింది. దీంతో ఉపాధి శ్రామికులకు తీరని అన్యాయం జరిగే పరిస్థితి ఏర్పడింది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో 4.71 లక్షల ఉపాధి శ్రామికులకు ఇక తీరని అన్యాయం జరిగే పరిస్థితి నెలకొంది. ఏలూరు జిల్లాలో 3.71 లక్షల ఉపాధి హామీ జాబ్ కార్డులు ఉండగా, పశ్చిమలో 1,02,806 మొత్తం 4.71 లక్షల ఉపాధి హామీ జాబ్ కార్డులు ఉన్నాయి. అత్యధిక మంది శ్రామికులకు ఉపాధి హామీ పనులే జీవనాధారం. ఈ ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి అక్టోబర్ నెలఖారు వరకూ పరిశీలిస్తే ఏలూరు జిల్లాలో 90.66



లక్షల పని దినాలు కల్పించగా, పశ్చిమలో 37.72 లక్షల పని దినాలు కల్పించారు. వచ్చే మార్చి నాటికి మరిన్ని పని దినాలు శ్రామికులకు కల్పించనున్నారు. ఉపాధి పనులు ఎంతో మందికి ప్రాణవాయువులా మారాయి. ఇప్పుడు మోడీ సర్కార్ ఉపాధి హామీ చట్టాన్ని పూర్తిగా మార్చేయడంతో ఇక పనికి గ్యారెంటీ లేకుండా పోయింది. పేరు మార్పుతో పాటు ఉపాధి శ్రామికులకు ఉన్న ప్రయోజనాలన్నింటినీ చిదిమేసిన పరిస్థితి. 2005లో వామపక్షాల మద్దతుతో యుపిఎ-1లో ఈ చట్టం వచ్చింది. దీని వెనుక వామపక్షాల కృషి ఎనలేనిది. పేదలకు ఈచట్టం ఒక వరంలా పనిచేస్తోంది. 2014లో మోడీ సర్కార్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఉపాధి హామీ చట్టాన్ని దెబ్బతీయాలని కుయుక్తులు పన్నుతూ వచ్చింది. బడ్జెట్‌లో నిధులు తగ్గించడంతోపాటు, రకరకాల ఆంక్షలు పెడుతూ వచ్చింది. ఇప్పుడు చట్టంలో పేదల కోసం పొందుపర్చిన ముఖ్యమైన అంశాలను సైతం మార్చేసింది. మహాత్మగాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టం పేరును ఇప్పుడు 'వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవకా మిషన్ '(విబి జిఆర్ఎఎంజి)గా మార్చేసింది. ఇది ఒక రకంగా గాంధీ ఆనవాళ్లను చెరిపేసే కుట్రలో భాగంగానే జరిగిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పాత చట్టానికి.. కొత్తగా చేసిన చట్టానికి తేడా ఇదే..

ఇప్పటి వరకూ చట్టంలో ఏడాదికి వంద రోజుల పని దినాలు కల్పించాలనే నిబంధన ఉంది. జనాన్ని మభ్యపెట్టేందుకు 125 పెంపు చేస్తున్నట్లు చూపి నిధులకు సంబంధించిన కోతలు పెట్టింది. పాత చట్టంలో డిమాండ్‌ను బట్టి నిధులు కేటాయించాలి. ఏడాది పొడవునా ఉపాధి పనులకు గ్యారెంటీ ఉంది. ప్రజలు డిమాండ్ చేసిన 15 రోజుల్లోగా పని కల్పించకపోతే నిరుద్యోగ భృతి ఇవ్వాల్సి ఉంటుంది. కూలీల వేతనాలు వంద శాతం కేంద్రమే భరిస్తోంది. 75 శాతం మెటీరియల్ ఖర్చు కేంద్రమే ఇవ్వాలి. కొత్తగా మార్పు చేసిన చట్టం అందుకు పూర్తి విరుద్ధంగా తయారైంది. డిమాండ్‌ను బట్టి పని కల్పన కాకుండా అవసరాన్ని బట్టి పనులు కల్పనగా మార్చేసింది. దీంతో శ్రామికులకు అవసరమైనప్పుడు కాకుండా వారికి ఇష్టమైనప్పుడు పనులు కల్పించే పరిస్థితి రానుంది. అంతేకాకుండా వ్యవసాయ సీజన్లలో 60 రోజుల పాటు ఉపాధి పనులు నిలిపేసేలా చట్టంలో మార్పు చేసింది. ఇప్పటివరకూ వ్యవసాయ సీజన్లలో అత్యధిక కూలి దక్కేది. ఇప్పుడు భూస్వాములు ఎంత కూలి ఇస్తే అంత కూలి తీసుకోవాల్సి ఉంటుంది. కేంద్రం కేటాయించిన నిధులకంటే ఎక్కువ ఖర్చయితే రాష్ట్రాలే భరించాల్సి ఉంటుంది. ఇప్పటి వరకూ ఉపాధి పనులకు సంబంధించి కేంద్రం 90 శాతం నిధులిస్తే రూ.పది శాతం రాష్ట్రాలు భరించేవి. ఇప్పుడు కేంద్రం నిధులు 60 శాతంగా, రాష్ట్రం 40 శాతం నిధులు భరించేలా చేసేశారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా రాష్ట్రాలు నిధులు కేటాయించకపోతే ఉపాధి పనులు లేకుండా పోతాయి. ఉపాధి హామీ చట్టంలో మోడీ సర్కార్ తెచ్చిన మార్పులు ఉపాధి శ్రామికులకు ఉరితాడుగా మారనున్నాయి. దీంతో మోడీ సర్కార్‌పై జనాల్లో తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. చట్టంలో చేసిన మార్పులను వెంటనే రద్దు చేయాలంటూ అంతా ముక్తకంఠంతో కోరుతున్నారు. ప్రజలు రోడ్డెక్కేందుకు సిద్ధపడుతున్నారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి మోడీసర్కార్ ఈ చట్టాన్ని ఎన్నివిధాలుగా దెబ్బతీయాలో అన్ని ప్రయత్నాలు చేసింది. ఇప్పుడు పూర్తిగా దెబ్బతీసిన పరిస్థితి నెలకొంది.

పాత చట్టాన్ని అమలు చేయాలి

పి. రామకృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి

2005లో తెచ్చిన ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలి. కేంద్ర బడ్జెట్‌లో నిధులు పెంచాలి. రాష్ట్రాలపై భారం పెట్టకూడదు. ఆన్‌లైన్ ఇబ్బందులను తొలగించాలి. 197 జిఒ రద్దు చేయాలి. ఉపాధి హామీ శ్రామికులకు పని గ్యారెంటీ కల్పించాలి.



సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్న నేతలు

ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి - సిపిఎం ఆధ్వర్యాన ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి డిమాండ్ చేశారు. శుక్రవారం పవర్‌పేట సుందరయ్య గ్రంథాలయం వద్ద ఉన్న గాంధీ విగ్రహం దగ్గర సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి రవి మాట్లాడుతూ కేంద్రంలో యుపిఎ మొదటి ప్రభుత్వంలో వ్యవసాయ కార్మికుల ప్రయోజనాల కోసం ఉపాధి హామీ చట్టాన్ని రూపొందించిందని గుర్తు చేశారు. దేశ వ్యాప్తంగా పనులు లేని సందర్భాల్లో గ్రామీణ ప్రాంతాలలో ఉపాధి హామీ చట్టం ఎంతగానో గత 16, 17 ఏళ్లుగా ఉపయోగపడిందని, కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో ఇది దేశ ప్రజల పాలిట ఆపన్న హస్తమైందని చెప్పారు. కార్పొరేట్ ప్రయోజనాల కోసం ఈ చట్టాన్ని పథకంగా మార్చేందుకు కార్పొరేట్ శక్తులు కుట్ర పన్నాయని విమర్శించారు. ఉపాధి హామీ చట్టానికి గతంలో 90 శాతం నిధులు కేంద్ర ప్రభుత్వం భరించాలని, 10 శాతం మాత్రమే రాష్ట్రాల వాటాగా ఉండేదని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం చేసుకున్న సవరణలో 40 శాతం రాష్ట్ర ప్రభుత్వాలు వాటాగాను, 60 శాతం మాత్రమే కేంద్ర ప్రభుత్వం వాటాగాను నిర్ణయించడం ద్వారా ఆయా రాష్ట్రాలపై పెనుభారం పడిందని తెలిపారు. ఈ చట్టం బాధ్యతల నుంచి కేంద్రం తప్పుకోవాలని ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. 40 శాతం రాష్ట్ర ప్రభుత్వంపై భారం పడినా రాష్ట్రంలో ఉన్న కూటమి ప్రభుత్వం నోరెత్తడం లేదని విమర్శించారు. దేశవ్యాప్తంగా అన్ని కార్మిక సంఘాలనూ కలుపుకొని 197 బిల్లుకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాన్ని నిర్మిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పివి.రామకృష్ణ, ఏలూరు నగర కార్యదర్శి పంపన రవికుమార్, సిపిఎం మాజీ కౌన్సిలర్ కంది విశ్వనాధం, నగర కమిటీ సభ్యులు ఎం.ఇస్సాక్, జె.గోపి, మహిళా సంఘం జిల్లా కార్యదర్శి ఎ.శ్యామల రాణి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ చట్టంపై కేంద్రం సవరణలు దుర్మార్గం

కలిదిండి : గ్రామీణ పేదల జీవనోపాధిలో కీలక పాత్ర పోషిస్తున్న మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం బలహీనపరిచే విధంగా సవరణలు చేయడం అత్యంత దుర్మార్గమని సిపిఎం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రవి అన్నారు. కలిదిండిలోని కళ్యాణి ఫంక్షన్ హాల్ వద్ద ముదినేపల్లి, కలిదిండి మండలాల పార్టీ కార్యకర్తలు విస్తృతస్థాయి సమావేశం వీరవల్లి భాస్కరరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2005లో వామపక్షాల ఒత్తిడితో అప్పటి యుపిఎ ప్రభుత్వం గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని తీసుకొచ్చిందని బిజెపి అధికారంలోకొచ్చినప్పటి నుంచి కూలీలకు పనిని దూరం చేసే విధంగా అనేక నిబంధనలు తీసుకొచ్చిందన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె.శ్రీనివాస్ మాట్లాడుతూ 90 శాతం కేంద్రం పది శాతం రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు కేటాయించి ఉపాధి హామీ చట్టాన్ని అమలు చేయాల్సి ఉండగా సవరణల ద్వారా 40 శాతం రాష్ట్ర ప్రభుత్వాలపై భారం వేయటం అత్యంత దారుణమన్నారు. సిపిఎం కలిదిండి, ముదినేపల్లి ప్రాంతీయ కమిటీ కార్యదర్శి ఎస్.మహంకాళిరావు మాట్లాడుతూ పార్టీ ఆధ్వర్యంలో ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకోవడానికి ఉపాధి కార్మికులను సమీకరించి పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు. గోతులమయంగా మారిన మండలంలోని మూలలంక నుంచి పెదలంక మీదుగా కొండింగి వరకు ఆర్‌అండ్‌బి రోడ్డును తక్షణమే నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కలిదిండి ప్రాంతీయ కమిటీ సభ్యులు చిన్నం మాధవ, శ్రీకాంత్, కుడిపూడి శ్రీనివాసరావు, కార్యకర్తలు పెరుమాళ్ల గోపీ, డివి.సత్యనారాయణ, సిహెచ్.సత్యనారాయణ, ఎస్ఎన్‌వి.సత్యనారాయణ, బి.రామనాగేంద్రరావు, ఎ.వెంకటేశ్వరరావు, జి.అనిల్‌కుమార్, వి.వరలక్ష్మి, ఎస్.మహాలక్ష్మి, జె.దుర్గ, పి.కనకదుర్గ, తదితరులు పాల్గొన్నారు.

22న మన్యం బంద్ జయప్రదం చేయాలి



ర్యాలీలో పాల్గొన్న నేతలు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

రంపచోడవరం పోలవరం నియోజకవర్గాలు కలిపి ప్రత్యేక జిల్లా చేయాలని ఈ నెల 22వ తేదీన మన్యం బంద్ జయప్రదం చేయాలని కోరుతూ మోటార్ బైక్ ప్రచార ర్యాలీ నిర్వహించారు. ఈ బైక్ యాత్ర బుట్టాయగూడెం కోట రామచంద్రపురం ఐటిడిఎ, దొరమామిడి, రామారావుపేట సెంటర్, రెడ్డి గణపవరం గ్రామాల మీదుగా యాత్ర జరిగింది. ఈ సందర్భంగా పోలవరం ప్రత్యేక జిల్లా సాధన కమిటీ కన్వీనర్ తెల్లం రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పోలవరం జిల్లాలో పోలవరం నియోజవర్గం లేకపోవడం సరి కాదన్నారు. జిల్లా ప్రకటన సమయంలో ప్రజా అభిప్రాయం సేకరించకుండా రంపచోడవరానికి పోలవరం పేరు పెట్టి పోలవరం ప్రాంతం లేకుండా చేయడం ఏంటని ప్రశ్నించారు ఈ నెల 22వ తేదీన జరిగే మన్యం బంద్‌లో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు మొడియం నాగమణి నాగేశ్వరరావు, కారం ముత్యాలరావు, కురసం భీమరాజు, వీటి వీరయ్య, చంద్రు బుల్లమ్మ, మహేష్, కారం సూరిసంద్రం, పృథ్వీరాజ్, మధుర, భాస్కర్ ఉన్నారు.

కుక్కునూరు రూరల్ : పోలవరం జిల్లాలో పోలవరం ఆదివాసీ ప్రాంతాన్ని చేర్చాలని కోరుతూ ఈనెల 22న జరిగే పోలవరం ఏజెన్సీ బంద్‌ను జయప్రదం చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి పట్ల లక్ష్మయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక సుందరయ్య భవనం ప్రజా సంఘాల కార్యాలయంలో కాక ఆనంద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముందుగా కరపత్రాలు విడుదల చేశారు. అనంతరం లక్ష్మయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన జిల్లాల పునర్విభజనలో భాగంగా ప్రకటించిన పోలవరం జిల్లా ఏలూరు ఏజెన్సీ ప్రజలను నిరాశపర్చిందని, పోలవరం జిల్లాలో పోలవరం లేకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. పోలవరం నిర్వాసిత ప్రాంతాన్ని ఒక జిల్లాగా ప్రకటిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. ప్రభుత్వం పోలవరం జిల్లాలో పోలవరం ఆదివాసీ ప్రాంతాన్ని చేర్చేలా చర్యలు తీసుకొనేందుకు ఈనెల 22న జరిగే పోలవరం ఏజెన్సీ ప్రాంత బంద్ నిర్వహించాలని పోలవరం జిల్లా సాధన కమిటీ పిలుపునిచ్చిందని, బంద్‌లో ఆదివాసీలు, నిర్వాసితులు, ఏజెన్సీ అభివృద్ధిని కోరుకొనేవారు అంతా పాల్గొని జయప్రదం చేయాలని లక్ష్మయ్య పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు యర్రంశెట్టి నాగేంద్రరావు, సిపిఎం మండల కార్యదర్శి యర్నం సాయికిరణ్, గిరిజన సంఘం నాయకులు నాగేంద్ర, వాసు, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న లక్ష్మయ్య

విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

డిఇఒ వెంకట లక్ష్మమ్మ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

విద్యార్థులు మత్తు పదార్థాలకు అలవాటు కాకుండా ఉండేందుకు యుటిఎఫ్ చేపట్టిన ప్రచార కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఏలూరు విద్యా శాఖాధికారి కార్యాలయంలో గంజాయికి విద్యార్థులను దూరం చేద్దాం రాష్ట్ర భవిష్యత్ కాపాడుకుందాం' అనే కరపత్రాన్ని జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.వెంకట లక్ష్మమ్మ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.రవికుమార్ మాట్లాడుతూ విద్యార్థులు మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని, తద్వారా మెరుగైన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏలూరు జిల్లా అధ్యక్షులు బొర్రా.సుభాషిణి, సహాధ్యక్షులు ఎస్.సుధారాణి, ఆడిట్ కన్వీనర్ బంటు మోహన్ పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న డిఇఒ

శాంతిభద్రతలు పరిరక్షించేందుకు కృషి

నెలవారీ నేర సమీక్షలో ఏలూరు డిఎస్‌పి శ్రావణ్‌కుమార్




ఏలూరు స్పోర్ట్స్ : సమీక్ష నిర్వహిస్తున్న డిఎస్‌పి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్ ఏలూరు స్పోర్ట్స్ : సమీక్ష నిర్వహిస్తున్న డిఎస్‌పి

నేరాలు నిరోధించి శాంతిభద్రతలు పరిరక్షించేందుకు సిబ్బంది కృషి చేయాలని ఏలూరు డిఎస్‌పి శ్రావణ్‌కుమార్ సూచించారు. నగరంలోని సబ్ డివిజనల్ పోలీస్ అధికారి కార్యాలయంలో నెలవారి నేర సమీక్ష సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిడమర్రు, కైకలూరు, నూజివీడు, భీమడోలు సర్కిల్స్ నూజివీడు రూరల్, ఏలూరు ప్రాంతాలకు చెందిన సిఐలు, ఎస్ఐలు ఈ నెలవారి సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు. ఏలూరు డిఎస్‌పి శ్రావణ్‌కుమార్ పలు కేసులకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ నేర సమీక్ష సమావేశం అనంతరం డిఎస్‌పి మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. పోలీస్ స్టేషన్ పరిధిలో గ్రామసభలను నిర్వహించి ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలోనే తెలుసుకోవాలని సూచించారు. అంతేకాకుండా స్థానిక యువతతో మాట్లాడి సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పించాలన్నారు. ప్రతి గ్రామంలో డ్రోన్ ద్వారా నిఘా ఏర్పాటు చేసి అసాంఘిక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. డ్రైవింగ్ లైసెన్స్‌లు లేకుండా వాహనాలు నడిపే మైనర్లపై కేసులు నమోదు చేసి ప్రమాదాల స్థాయిని తగ్గించాలని సూచించారు. తరచూ సబ్ డివిజన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించాలని తెలిపారు. సంక్రాంతి వస్తున్న నేపథ్యంలో కోడిపందేలు, పేకాట, రికార్డింగ్ డ్యాన్సులు వంటి చట్ట వ్యతిరేఖమైన అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడేవారిపై క్రిమినల్ చర్యలు తీసుకుని వారిపై సీట్లు ఓపెన్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు వన్ టౌన్ సిఐ సత్యనారాయణ, టూటౌన్ సిఐ అశోక్‌కుమార్, త్రీ టౌన్ సిఐ కోటేశ్వరరావు, భీమడోలు సిఐ విల్సన్, నిడమర్రు సిఐ రజినికుమార్, కైకలూరు సిఐ రామకృష్ణ, కైకలూరు రూరల్ సిఐ రవికుమార్, ఎస్ఐలు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ముసునూరు పోలీస్‌స్టేషన్‌లో తనిఖీలు

ముసునూరు : మండల కేంద్రమైన ముసునూరు పోలీస్ స్టేషన్‌లో నూజివీడు డిఎస్‌పి కెవివిఎన్‌వి.ప్రసాద్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కేసుల దర్యాప్తు, శాంతి భద్రతలపై పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ముందుగా డిఎస్‌పి స్టేషన్ నిర్వహణ, రికార్డులు, కేసుల పురోగతిని ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ బాధితులకు జరిగే న్యాయం, ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. నమోదైన కేసుల్లో దర్యాప్తును వేగవంతం చేసి, బాధితులకు సకాలంలో న్యాయం చేకూర్చాలన్నారు. నిందితులను వెంటనే అరెస్టు చేసి నిర్ణీత గడువులోగా కోర్టులో ఛార్జ్‌షీట్లను దాఖలు చేయాలని, అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతూ, డ్రోన్ నిఘా మండల పరిధిలోని 16 గ్రామాల్లోని శాంతి భద్రతలను కాపాడటంలో ఎటువంటి నిర్లక్ష్యం వహించకూడదని డిఎస్‌పి స్పష్టం చేశారు. డ్రోన్ పెట్రోలింగ్ మారుమూల ప్రాంతాలు, అటవీ పరిసరాల్లో డ్రోన్ కెమెరాల ద్వారా గస్తీ నిర్వహించాలని ఆదేశించారు. జూదం, కోడిపందేల ఏర్పాటుపై డ్రోన్ నిఘా ఏర్పాటు చేయాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని, రౌడీ షీటర్లకు కఠిన హెచ్చరికలు జారీ చేయాలని, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులపై పోలీసు నిఘా నిరంతరం ఉంచాలని, స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లు, పాత నిందితులను వారి ఆధ్వర్యంలో పిలిపించి, వారి ప్రవర్తనలో మార్పు రావాలని కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎవరైనా చట్ట విరుద్ధమైన పనులకు పాల్పడినా, ప్రజాశాంతికి భంగం కలిగించినా, వారిపై చట్ట ప్రకారం కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజల రక్షణే పోలీసుల ప్రథమ కర్తవ్యమని చెప్పారు. ఫిర్యాదుదారులతో మర్యాదగా ప్రవర్తిస్తూ సమస్యలను త్వరగా పరిష్కరించాలని చెప్పారు.



ముసునూరు : కౌన్సెలింగ్ ఇస్తున్న డిఎస్‌పి

టెట్‌కు 148 మంది హాజరు : డిఇఒ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఉపాధ్యాయ అర్హత పరీక్ష టెట్ శనివారం ఏలూరులో ప్రశాంతంగా జరిగింది. వట్లూరులోని సిద్ధార్థ క్వెస్ట్ పాఠశాలలో ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:00 గంటల వరకూ జరిగిన పరీక్షకు మొత్తం 175 మందికి 148 మంది హాజరు కాగా 27 మంది గైర్హాజరయ్యారు. అలాగే మధ్యాహ్నం రెండు గంటల 30 నిమిషాల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకూ జరిగిన రెండో విడత పరీక్షకు మొత్తం 175 మందికి 164 మంది హాజరు కాగా 11 మంది గైర్హాజరయ్యారు. ఈ పరీక్షలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదని, పరీక్ష ప్రశాంతంగా జరిగిందని జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.వెంకట లక్ష్మమ్మ తెలిపారు.

అక్టోబర్‌కు జాతీయ రహదారి నిర్మాణం పూర్తి

నేషనల్ హైవే ఎస్ ఇ శంకర్ రెడ్డి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

వచ్చే సంవత్సరం అక్టోబర్ నాటికి తాటియాకులగూడెం నుంచి పట్టిసీమ వరకూ చేపడుతున్న నూతన జాతీయ రహదారి (365 బిబి) నిర్మాణం పూర్తవుతుందని జాతీయ రహదారి ఎస్ఇ శంకర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం తాటి యాకులగూడెం నుంచి పట్టిసీమ వరకూ చేపడుతున్న నూతన జాతీయ రహదారి (365 బిబి) నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే అక్టోబర్ నాటికి నిర్మాణ పనులు పూర్తయి నూతన జాతీయ రహదారి అందుబాటులోకి వస్తుందని తెలిపారు. జాతీయ రహదారికి భూములు ఇచ్చిన కొద్ది మంది దుకాణాల యజమానులకు నగదు పడకపోవడంపై దృష్టి సారించినట్లు తెలిపారు. ఆయనతో పాటు నేషనల్ హైవే ఇఇ శ్రీనివాస్, ఎఇఇ ఖాజా సిబ్బంది పాల్గొన్నారు.

హత్య కేసులో ఇద్దరికి జీవిత ఖైదు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

మద్యం దుకాణం వద్ద జరిగిన ఘర్షణలో ఓ వ్యక్తిని హతమార్చిన ఘటనలో ఇద్దరు వ్యక్తులకు జిల్లా న్యాయమూర్తి జీవిత ఖైదు విధించారు. ఏలూరు ఒకటో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని తూర్పు వీధికి చెందిన తిరుమల రామ శివ, పిచ్చుకలగుంట ప్రాంతానికి చెందిన కలవల నాగరాజు కలిసి 2018 మే 17వ తేదీ సత్యనారాయణపేటలో సుప్రీం వైన్స్ వద్ద మద్యం తాగుతున్నారు. అప్పుడు అక్కడే ఉన్న ఏలూరు నగరానికి చెందిన సియాద్రి శ్రీ హర్ష అనే వ్యక్తికి వీరికి మధ్య చిన్నపాటి వివాదం తలెత్తింది. దీంతో కోపద్రక్తులైన రామశివ, నాగరాజులు శ్రీహర్షపై రాడ్డుతో దాడి చేశారు. ఈ దాడిలో శ్రీహర్ష అక్కడికక్కడే మృతి చెందాడు. దీనిపై శ్రీహర్ష బంధువులు ఒకటో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి సిఐ నాగ మురళి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. శుక్రవారం ఈ కేసులో వాదోపవాదనల అనంతరం రామశివ, నాగరాజులను జిల్లా న్యాయమూర్తి శ్రీదేవి ముద్దాయిలుగా నిర్ణయించి వారికి జీవిత ఖైదు విధించారు. ఈ కేసులో అత్యంత ప్రతిభ కనబరిచినవారిని ఎస్‌పి అభినందించారు.

ఉత్తమ ఫలితాలు ఇస్తున్న కోర్టు మానిటరింగ్ సెల్

కోర్ట్ మానిటరింగ్ సెల్‌ను ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్ ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. ఇది ఏర్పాటు చేసినప్పటి నుంచి ఈ సెల్ సత్ఫలితాలను ఇస్తుంది. 2024లో ఈ కోర్టు మానిటరింగ్ సెల్ ఏర్పాటు చేసినప్పటి నుంచి ఇప్పటివరకు 41 కేసుల్లో నిందితులకు శిక్షలు విధించేలా చర్యలు చేపట్టారు. మొత్తం 19 జీవిత ఖైదు శిక్షలు విధించగా, మూడు కేసుల్లో రెండుసార్లు జీవిత ఖైదు విధించారు. మూడు కేసుల్లో ముగ్గురు నిందితులకు 20 ఏళ్ల జైలు శిక్ష, తొమ్మిది కేసుల్లో 11 మందికి పదేళ్ల జైలు, మూడు కేసుల్లో ముగ్గురు నిందితులకు ఏడేళ్ల జైలు, నాలుగు కేసుల్లో నలుగురు ముద్దాయిలకు ఐదేళ్ల జైలు, ఒక కేసులో ఒక ముద్దాయికి నాలుగేళ్ల జైలు శిక్ష విధించారు. మొత్తం 41 కేసుల్లో 51 మంది నిందితులకు శిక్షలు విధించారు. దీంతో శిక్షల శాతం 156గా నిర్ధారించారు.

నేడు ట్రెయినింగ్ సెంటర్లకు కానిస్టేబుల్ అభ్యర్థులు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైనవారిని శనివారం ఆయా పోలీస్ ట్రైనింగ్ సెంటర్లకు పంపనున్నట్లు ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్ తెలిపారు. నగరంలోని పోలీసు కళ్యాణ మండపంలో కొత్తగా కానిస్టేబుల్‌గా ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్ జిల్లా అదనపు ఎస్‌పి నక్క సూర్యచంద్రరావు నిర్వహించారు. ఎంపికైన అభ్యర్థుల్లో 132 మంది పురుష కానిస్టేబుళ్లు 61 మంది మహిళ కానిస్టేబుళ్లు ఉన్నారని ఎస్‌పి తెలిపారు. 193 మందిని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా నుంచి ట్రైనింగ్‌కు పంపుతున్నట్లు చెప్పారు. శనివారం ఉదయం తొమ్మిది గంటలకు పురుష అభ్యర్థులను అనంతపురం ట్రైనింగ్ సెంటర్‌కు, మహిళా అభ్యర్థులను విజయనగరం ట్రైనింగ్ సెంటర్‌కు పంపిస్తున్నట్లు తెలిపారు. ఈ ట్రైనింగ్ తొమ్మిది నెలలపాటు కొనసాగుతుందని తెలిపారు. అభ్యర్థులంతా తమ సామగ్రితో శనివారం ఏలూరు నుంచి బయలుదేరాలని తెలిపారు.

శీతాకాలంలో జాగ్రత్తలు తప్పనిసరి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

శీతాకాలంలో జాగ్రత్తగా ఉండాలని, చలి వాతావరణం వల్ల మనం అనారోగ్య సమస్యలకు గురయ్యే అవకాశం ఉందని అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు సూచించారు. స్థానిక ఏలూరు పవర్‌పేట పట్టణ ఆరోగ్య కేంద్రం శేఖర్ వీధి ప్రజలకు ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా శీతాకాలంలో సంభవించే అనారోగ్య సమస్యల గురించి వివరించారు. ఈ మధ్యకాలంలో స్క్రబ్ టైఫస్ అక్కడక్కడ కనిపిస్తున్నాయని, ప్రజలు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. చలి వాతావరణం వల్ల శరీరంలో మార్పులు జరిగి ఎలర్జీ కండిషన్స్ వస్తాయని, ముఖ్యంగా దగ్గు, జలుబు, తుమ్ములు, ఆయాసం, ఉబ్బసం, శరీరంపై దద్దుర్లు, జ్వరాలు తదితర అంటువ్యాధులతో బాధపడే అవకాశం ఉందన్నారు. ఐదేళ్ల లోపు పిల్లలు, వృద్ధులు, బాలింతలు, గర్భిణులు ఉదయం సమయంలో చలిలో తిరగరాదని, తగు నివారణ చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో పవర్ పేట పట్టణ కేంద్ర వైద్యాధికారి డాక్టర్ గౌతమ్ ఆధ్వర్యంలో, హెల్త్ అసిస్టెంట్లు మేకా శ్రీనివాసరావు, మణికుమార్, ఆరోగ్య కార్యకర్తలు లంక జ్యోతి, ఆశా కార్యకర్త, ప్రియాంక, సునీత, పట్టణ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

కళాశాలలో ఎఐ ల్యాబ్ ఏర్పాటుకు చర్యలు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ ఆదేశాల మేరకు బుట్టాయగూడెం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ల్యాబ్ ఏర్పాటు చేస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మహేంద్రరావు తెలిపారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విద్యను అందించే లక్ష్యంతో సుమారు 20 కంప్యూటర్లతో ఈ ల్యాబ్‌ను ఏర్పాటు చేస్తున్నారు. దీని ద్వారా విద్యార్థులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రానుంది. ఈ కార్యక్రమంలో ఒఎన్‌జిసి ప్రతినిధులు నేహ, బండారు అవినాష్, రాజేష్, కళాశాల ఆధ్యాపకులు ఎస్.అక్కులన్న, ఎం.వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి డోర్ డెలివరి మాసోత్సవాలు

ప్రజాశక్తి - ఏలూరు

ఎపిఎస్ ఆర్‌టిసి ప్రజలకు మరింత చేరువగా కార్గో సేవలను అందించేందుకు డోర్ డెలివరి సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చిందని ఏలూరు జిల్లా ఎటిఎం జిఎలెసి.సుబ్బారావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఏలూరు డిపోలో వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ 50 కేజీల బరువు వరకు బుకింగ్ చేసిన డోర్ డెలివరి పార్శిల్, కొరియర్లను మీ ఇంటి వద్దకు చేర్చనున్నట్లు తెలిపారు. కార్గో కౌంటర్ నుంచి పది కిలోమీటర్ల పరిధిలో ఈ డోర్ డెలివరి సేవలను అందించనున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలోని 84 ప్రధాన నగరాల్లో, పట్టణాల్లో ఈ సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. తక్కువ ఛార్జీలతో సకాలంలో సురక్షితంగా మీ పార్శిల్‌ను ఇంటి వద్దకు సురక్షితంగా చేర్చనున్నట్లు తెలిపారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

సంక్షేమ పథకాలు అర్హులందరికీ చేరేలా అవిశ్రాంతంగా కృషి చేస్తున్నానని ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి తెలిపారు. పవర్‌పేటలోని ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ప్రజాదర్బార్‌కు విశేష స్పందన లభించింది. ప్రజల సమస్యలను స్వయంగా విని, అక్కడికక్కడే పరిష్కార చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అభివృద్ధి, సంక్షేమం, ప్రజాసమస్యల పరిష్కారాల్లో స్పష్టమైన ఫలితాలు కనిపిస్తున్నాయని, రానున్న రోజుల్లో మరింత సమర్థవంతంగా పని చేస్తామని ఎంఎల్ఎ స్పష్టం చేశారు.

ప్రత్యేక పంచాయతీ కోరుతూ వినతి

ప్రజాశక్తి - టి.నరసాపురం

టి.నరసాపురం పంచాయతీ పరిధిలో ఉన్న ఆరు గ్రామాలను ప్రత్యేక గ్రామ పంచాయతీగా పునర్విభజన చేయాలని కోరుతూ శుక్రవారం బంజారా భజరంగి బేరీ సంఘం నాయకులు భూక్యా వేణుగోపాల్ ఎంపిడిఒ జి.మణికుమారికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక సౌకర్యాలు, సంక్షేమం, అభివృద్ధి అనే మూడు ప్రధానాంశాలుగా కృష్ణాపురం, పుట్రేపు, ప్రకాష్ నగర్, రుద్రకోటరాజుగూడెం, కాపు గూడెం, రాజులగూడెం ఆరు గ్రామాలను కలిపి ప్రత్యేక పంచాయతీగా పునర్విభజన చేయాలని కోరారు. ప్రస్తుత టి.నర్సాపురం పంచాయతీలో ఆరు గ్రామాలాభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నాయన్నారు. ఆరు గ్రామాల్లో ఎస్‌సి, ఎస్‌టిలు ఎక్కువగా ఉన్నారని తెలిపారు. ప్రజల సమస్యలపై టి.నరసాపురం గ్రామపంచాయతీకి వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే ప్రత్యేక పంచాయతీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో భూక్యా రాములు, భూక్యా బేగనాథం, భూక్యా వేణుగోపాల్, భూక్యా పోతురాజు పాల్గొన్నారు.



అభినందిస్తున్న ఎంఎల్ఎ బడేటి చంటి

ఫణికాంత్ డ్యాన్స్ అకాడమీవారికి అభినందన

ప్రజాశక్తి - ఏలూరు

హైదరాబాద్‌లో సౌత్ ఇండియా డ్యాన్స్ కాంపిటీషన్‌లో అవార్డు గెలుచుకున్న ఫణికాంత్ డ్యాన్స్ అకాడమీవారిని ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి అభినందించారు. కల్చరల్ ఫైన్ ఆర్ట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ త్యాగరాయగానసభ వేదికగా జరిగిన దక్షిణ భారతదేశ నృత్య పోటీల్లో ఫణికాంత్ డ్యాన్స్ అకాడమి వారు ప్రథమ బహుమతి సాధించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ ఇటువంటి కారక్రమాల్లో పిల్లలను ప్రోత్సహించడం ద్వారా వారికి మానసిక ఉత్సాహం పెరుగుతుందని తెలిపారు. ఏలూరు జాతరను ప్రజెంట్ చేసేవిధంగా కొరియోగ్రాఫ్ చేసిన డ్యాన్స్ మాస్టర్ యర్రంశెట్టి ఫణికాంత్‌కు శుభాకాంక్షలు తెలిపారు.



ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

వైసిపి పట్టణ అధ్యక్షులు కర్పూరం గుప్తా పుట్టినరోజు సందర్భంగా జంగారెడ్డిగూడెం ఎంబి సోషల్ క్లబ్ ఆవరణలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు జక్కంపూడి రాజా, చింతలపూడి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కంభం విజయరాజు, మచిలీపట్నం పార్లమెంట్ పరిశీలకులు జెట్టి గురునాధరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన నాగలక్ష్మి, ఏలూరు యువజన విభాగం అధ్యక్షులు కామిరెడ్డి నాని పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

వ్యక్తిపై కేసు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

ఓ వివాహితను వేధిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ క్రాంతికుమార్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని దర్భగూడెం గ్రామానికి చెందిన ఓ వివాహితకు ఆరేళ్ల క్రితం వివాహమైంది. వారికి ఒక కుమారుడు ఉన్నాడు. అదే గ్రామానికి చెందిన కె.దేవ అనే వ్యక్తి గత కొంతకాలంగా తనను లైంగికంగా వేధిస్తున్నాడని వివాహిత పెద్దలకు చెప్పగా వారు అతనిని మందలించారు. అయిన అతని ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

సత్తా చాటిన ముదినేపల్లి యువకులు

ముగ్గురికి పోలీస్ కొలువులు
పలువురి అభినందన

ప్రజాశక్తి - ముదినేపల్లి

కొత్త పోలీస్ రిక్రూట్ మెంటులో ముదినేపల్లి మండలం నుంచి ముగ్గురు యువకులు సత్తా చాటారు. కానిస్టేబుళ్లుగా ఎంపికై నియామక పత్రాలు అందుకున్నారు. మండలంలోని వైవాక, బొమ్మినంపాడ శివారు గొల్లగూడెం, ఈడేపల్లి గ్రామాలకు చెందిన యువకులు పట్టుదలతో శ్రమించి ఈ ఉద్యోగాలు సాధించారు. వీరందరూ ఆర్థికంగా వెనుకబడిన తరగతులకు చెందిన వారే కావడంతో ఆయా కుటుంబాల్లో ఆనందం వ్యక్తమవుతున్నాయి. కష్టపడి చదినందుకు ఫలితం దక్కిందని యువకుల కుటుంబ సభ్యులు ఆనందపడుతున్నారు.

కల నెరవేరింది
మండే బాలయ్య, వైవాక



కల నెరవేరింది. ఎపిఎస్‌సి రాజమండ్రి బెటాలియన్‌లో కానిస్టేబుల్‌గా ఎంపిక కావడం తనకు ఎంతో సంతోషం కలిగించింది. పోలీస్ శాఖలో ఉద్యోగం సాధించాలన్న తన కల నెరవేరింది. తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే తాను ఈ ఉద్యోగం సాధించగలిగాను. తన విధులను బాధ్యతగా నిర్వర్తిస్తా.

కష్టానికి ఫలితం దక్కింది
బుర్ల అన్నమయ్య, గొల్లగూడెం



తల్లి దండ్రులు ఎంతో కష్టపడి చదివించారు. 2020లో బిఎస్‌సి పాసైన నాటి నుంచి వ్యవసాయ పనులు చేసుకుంటూ, పోటీ పరీక్షలకు పుస్తకాలు చదువుతూనే ఉన్నాను. రెండోసారి రిక్రూట్‌మెంట్‌కు పట్టుదలతో చదివి ఎంపికయ్యా. కానిస్టేబుల్ ఉద్యోగం రావడం ఎంతో ఆనందంగా ఉంది.

ఇష్టమైన ఉద్యోగం
వీరసాగసాయి సతీష్, ఈడేపల్లి



తనకు ఇష్టమైన ఉద్యోగం సాధించగలిగాను. తొలి ప్రయత్నంలోనే కానిస్టేబుల్‌గా ఎంపిక కావడం ఎంతో సంతోషం కలిగించింది. తల్లి దండ్రులు కూడా నన్ను ప్రభుత్వ ఉద్యోగిగా చూడాలనుకుని కష్టపడి చదివించారు. పోలీస్ శాఖ ద్వారా ప్రజలకు తన వంతు సేవలందిస్తా.

బాధిత కుటుంబానికి సాయం

ప్రజాశక్తి - ముసునూరు

ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న కుటుంబానికి టిడిపి గ్రామ అధ్యక్షులు గార్లపాటి నరసింహారావు ఆర్థిక సాయం అందించారు. మండల కేంద్రమైన ముసునూరు గ్రామానికి చెందిన గొల్లపల్లి రంగారావు అనారోగ్యంతో మరణించారు. ఆయన కుటుంబానికి ఎంతో కొంత ఆర్థిక సహాయం చేయాలని ఉద్దేశంతో నరసింహారావు రూ.ఐదు వేలు అందించారు.

నిర్దోషులను విధుల్లోకి తీసుకోవాలి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.సుందరయ్య అక్రమ సస్పెన్షన్ రద్దు చేయాలని కోరుతూ శుక్రవారం నూజివీడు సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఎస్‌డబ్ల్యుఎఫ్ గౌరవ అధ్యక్షులు జి.రాజు మాట్లాడుతూ ఏలూరులో ఆర్‌టిసి నిర్వహిస్తున్న పెట్రోల్ బంకులో జరిగిన అవినీతిపై ప్రభుత్వం విచారణ జరిపి అసలు నిందితులను శిక్షించాలని, నిర్దోషులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిపో అధ్యక్షులు ఎవిఎస్.రావు, కార్యదర్శి ఎకెడి.ప్రసాద్, బిఎ.వాసు, ట్రెజరర్ టి.నాగశ్రీధర్ పాల్గొన్నారు.

సిఎస్ఎంఆర్ఎస్ శాస్త్రవేత్తల పర్యటన

ప్రజాశక్తి - పోలవరం

పోలవరంలో సెంట్రల్ సాయిల్, మెటీరియల్స్ రీసెర్చ్ స్టేషన్ (సిఎస్ఎంఆర్ఎస్) శాస్త్రవేత్తలు పర్యటించారు. ప్రాజెక్టులోని డయాఫ్రమ్ వాల్ ప్రాంతంలో వినియోగిస్తున్న కంకరను సిఎస్ఎంఆర్ఎస్ శాస్త్రవేత్తలు రవి అగర్వాల్, లలిత్‌కుమార్ సోలంకి శుక్రవారం పరిశీలించారు. కంకరను సిమెంట్, ఇసుకతో కలిపిన తరువాత నాణ్యత ఎలా ఉందో అక్కడ పరిశీలించారు. ఆ తరువాత ప్రాజెక్టులోని ల్యాబ్‌లో కూడా పరీక్షించారు. కొన్ని నమూనాలను తమ వెంట తీసుకెళ్లి కేంద్ర పరిశోధనాస్థానంలో పరీక్షించేందుకు సేకరించారు. వీరి వెంట జలవనరుల శాఖ ఇఇ డి.శ్రీనివాస్, డిఇఇలు శివప్రసాద్, నిర్మల, మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ (ఎంఇఐఎల్) డిప్యూటీ జనరల్ మేనేజర్ మురళి, పమ్మి, తదితరులు ఉన్నారు.

చిన్నారులకు పోలియో చుక్కలు తప్పనిసరి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

ఐదేళ్ల లోపు పిల్లలకు పల్స్ పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలని పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు అన్నారు. ఈ మేరకు మండలంలోని బర్రింకలపాడు ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయంలో పోలియో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ డిసెంబర్ 21న జాతీయ పల్స్ పోలియో దినోత్సవం సందర్భంగా ఐదేళ్ల లోపు ఉన్న పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి మణికంఠ, సిహెచ్ఒ శ్రీనివాసరాజు, హెల్త్ అసిస్టెంట్ ప్రసాద్, వైద్య సిబ్బంది నాగేశ్వరరావు, ఎఎన్ఎం పాల్గొన్నారు.

ధ్యానంతో మానసిక ఒత్తిడి దూరం

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

ప్రతిరోజు ధ్యానం చేయడం ద్వారా మానసిక ఒత్తిడిని దూరం చేసుకోవచ్చని పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు అన్నారు. ఈ నెల 21న ప్రపంచ ధ్యాన దినోత్సవం సందర్భంగా బర్రింకలపాడు ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. మండలంలోని కామయ్యపాలెంలో శ్రీ రామచంద్ర మిషన్ హార్ట్‌ఫుల్ నెస్ సెంటర్‌లో ప్రత్యేక ధ్యాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మడివి పుల్లారావు, బద్దె ముత్యాలరావు, నాని పాల్గొన్నారు.

'రాష్ట్రాభివృద్ధికి కూటమి కృషి'

ప్రజాశక్తి - దెందులూరు

కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి సంక్షేమ పథంలో పయనిస్తుందని, గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి పేదవాడికి మూడు సెంట్ల ఇంటి స్థలం ఇచ్చి వాళ్ల సొంత ఇంటి కలను సాకారం చేసేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ తెలిపారు. దుగ్గిరాలలోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఉదయం దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్‌ను బిజెపి జిల్లా అధ్యక్షులు చౌటుపల్లి విక్రమ్‌కిషోర్, బిజెపి నాయకులు కలిసి ఈ నెల 22వ తేదీన జిల్లాలో జరగనున్న అటల్ మోదీ సుపరిపాలన యాత్ర కార్యక్రమంలో పాల్గొనాలని తెలుపుతూ ఆహ్వాన పత్రికను అందించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలోని పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, అధికారులు దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పలు ఆహ్వాన పత్రికలు, పుష్పగుచ్ఛాలు అందించారు. ఈ సందర్భంగా పలు గ్రామాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులు స్వీకరించిన ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ వాటిని క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం సత్వరమే వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.


ఘనంగా సెమీ క్రిస్మస్

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. మంత్రి ముఖ్య అతిథిగా హాజరై అందరికి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కేక్ కట్ చేశారు. స్నేహ రైట్స్ బి.నగేష్‌రావు ఆధ్వర్యంలో 30 మంది నిరుపేదలకు 17 రకాల నిత్యావసర సరుకులు అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మునుపెన్నడూ లేని విధంగా క్రిస్టియన్ సోదరుల అభివృద్ధి, సంక్షేమానికి కూటమి ప్రభుత్వం రూ.150 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధికి, సంక్షేమ కార్యక్రమాల అమలుకు ప్రజలు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, చర్చి ఫాదర్లు, సిస్టర్లు, చర్చి, పెద్దలు ఇళయరాజా, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన

ప్రజాశక్తి - ముదినేపల్లి



బుట్టాయగూడెంలో...


మండలంలోని రైతులకు, గ్రామ వ్యవసాయ సహాయకులకు మండల వ్యవసాయాధికారి వారి ఆధ్వర్యంలో సమాచార హక్కు చట్టం-పై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి బి.వేణుమాధవ్ మాట్లాడుతూ 2005లో అమల్లోకి వచ్చిన సమాచార హక్కు చట్టం ఈ ఏడాదితో 20 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా కలెక్టర్ ఆదేశానుసారం జిల్లావ్యాప్తంగా అన్ని ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో సమాచార హక్కు చట్టంపై ఈ అవగాహన కార్యక్రమం చేపడుతున్నారని తెలిపారు. కేవలం కోర్టుఫీ స్టాంపుతో పౌరులు తమకు కావాల్సిన సమాచారాన్ని అర్జీ రూపంలో సంబంధిత పౌర సమాచార అధికారికి తెలియజేసి వారికి కావాల్సిన పూర్తి సమాచారం పొందవచ్చని తెలిపారు. పౌర సమాచార అధికారి వారి నుంచి సరైన స్పందన లభించకపోతే అప్పిలేటు అథారిటీ వారిని సంప్రదించే అవకాశం కూడా పౌరులకు ఉందని తెలిపారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయం నుంచి గురజ సెంటర్ వరకు రైతులతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముదినేపల్లి మండలంలోని పలువురు రైతులు, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

జీలుగుమిల్లి : ఆర్‌టిఐ చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖాధికారి కె.గంగాధర్ తెలిపారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయం నుంచి సమాచార హక్కు చట్టంపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ అధికారుల నుంచి సమాచారం పొందే హక్కు ప్రతి పౌరుడుకి ఉందని, సమాచారం చెప్పడం ప్రభుత్వ భాధ్యత అని చెప్పారు. అవినీతిని నిర్మూలించడం ఈ చట్టం ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ కె.వెంకటలక్ష్మి, ఎంఇఒలు కె.శ్రీనివాస్, బుచ్చయ్య, ఇఒపిఆర్‌డి నిఖిల్, పిఆర్ఎఇ రామానుజం, పలు శాఖల అధికారులు, పంచాయతీ అభివృద్ధి అధికారులు, అగ్రికల్చర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

బుట్టాయగూడెం : బుట్టాయగూడెం ఆర్ఎస్‌కెలో మండల రైతులకు, వ్యవసాయ శాఖ సిబ్బందికి సమాచార హక్కు చట్టం-2005పై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి ఎంఆర్‌పి ప్రియంకా మాట్లాడుతూ రైతులందరూ సమాచార హక్కు చట్టంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. వ్యవసాయ, ఇతర శాఖల నుంచి రైతులు తమకు కావాల్సిన సమాచారాన్ని పొందుకోవచ్చని తెలిపారు. మండల కేంద్రంలో సమాచార హక్కు చట్టంపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతుసేవా కేంద్రల సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం ఏర్పాటు అభినందనీయం

ప్రజాశక్తి - కుక్కునూరు రూరల్



రక్తదానం చేస్తున్న వ్యక్తులు

తలసేమియా పిల్లల కోసం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరం అభినందనీయమని కుక్కునూరు తహశీల్దార్ రమేష్, ఎస్ఐ రాజారెడ్డి కొనియాడారు. లారీ యూనియన్ ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా ది లారీ ఓనర్స్, డ్రైవర్స్ అసోసియేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో కుక్కునూరులో యూనియన్ కార్యాలయం వద్ద నిర్వహించిన మెగా రక్తదాన శిబిరం విజయవంతమైంది. ఈ సందర్భంగా లారీ యూనియన్ అధ్యక్షులు గంజి రాంబాబు అధ్యక్షతన నిర్వహించిన సభలో తహశీల్దార్ రమేష్, ఎస్ఐ రాజారెడ్డి మాట్లాడుతూ అన్ని దానాల్లో గొప్ప దానం రక్తదానమన్నారు. ఖమ్మం ఎన్‌జిఒ సంస్థ తలసేమియా వ్యాధితో ఇబ్బందులు పడుతున్న 400 మంది చిన్నారులకు ఉచితంగా సేవలు చేస్తున్నారన్నారు. శిబిరంలో 50 మంది స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేశారు. ప్రధానంగా శ్లోక స్కూల్‌లో కేరళ నుంచి వచ్చి ఉపాధ్యాయులుగా సేవలందిస్తూ రక్తదానం చేయడం అభినందనీయమని కొనియాడారు. ఈ శిబిరంలో 104 ఉద్యోగి ఏడో సారి రక్తదానం చేశారన్నారు. టిడిపి మండలాధ్యక్షులు, కుక్కునూరు ఎంపిటిసి సభ్యులు ములిశెట్టి నాగు తలసేమియా పిల్లలకు భరోసా కోసం రూ.ఐదు వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి యర్నం సాయికిరణ్, లారీ యూనియన్ కార్యదర్శి వలిపాషా, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు యర్రంశెట్టి నాగేంద్రరావు, కుక్కునూరు మేజర్ పంచాయతీ ఉప సర్పంచి పిచ్చుక రాజు, జనసేన మండల ప్రధాన కార్యదర్శి మోదంపరుపు వెంకన్నబాబు, టిడిపి మండల నాయకులు రమణరాజు, గిరిజన సంఘం మండల కార్యదర్శి పట్ల లక్ష్మయ్య, కాక ఆనంద్, తలసేమియా, సికిన్ సెలిమియా ఆర్గనైజర్ నరేష్, విఆర్ఒ సాయి, నాగరాజు, రామకృష్ణ, లారీ యూనియన్ నాయకులు, ఓగిరాల నాగరాజు, నిర్మల వెంకటేశ్వర్లు, కొప్పెర శ్రీను, కట్టబోయిన మహేష్, రాంబాబు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ పై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - టి.నరసాపురం

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఎంత అందిపుచ్చుకున్నా రోజురోజుకు పెరుగుతున్న రద్దీ, రోడ్డు ప్రమాదాల నివారణకు తమ వంతు కృషిగా ప్రాథమిక విద్య నుంచే రోడ్డు ప్రమాదాల నివారణ ట్రాఫిక్‌పై అవగాహన కల్పించాలనే సంకల్పంతో టి.నరసాపురం గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త ఎస్‌డి.నాసర్ పాషా వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అందులో భాగంగానే శుక్రవారం మండల పరిధిలోని కొరివి రామన్నగూడెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో రోడ్డు ప్రమాదాన్ని ఎలా గుర్తించాలి, ఊహించని ప్రమాదాలను ఎలా తప్పించుకోవాలి, ట్రాఫిక్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సామాజిక కార్యకర్త పాషా మాట్లాడుతూ ఇటీవల ఎపి, తెలంగాణ, సౌదీ అరేబియాలో జరిగిన బస్సు ప్రమాదాలు తమను ఎంతగానో కలచివేశాయన్నారు. ఇప్పటికే ప్రాథమిక విద్య నుంచే విద్యార్థులకు ట్రాఫిక్‌పై అవగాహన కల్పించాలని, ఈ అంశాన్ని పాఠ్యాంశంలో చేర్చాలని కోరుతూ ఇటీవల అమరావతిలో రాష్ట్ర ప్రభుత్వానికి ఒక లేఖ కూడా అందించామని ప్రభుత్వం కూడా స్పందించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. సెల్ ఫోన్ డ్రైవింగ్ ప్రమాదమని తెలిసినా, ద్విచక్రవాహదారులు చిన్న తరహా, భారీ వాహనాలు నడిపే డ్రైవర్లు, ఎక్కువ శాతం సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేస్తున్నారని, దీంతో ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు. రోడ్డు ప్రమాదాల నివారణకు, శబ్ద కాలుష్యాన్ని నివారించాలని స్థానిక పోలీసులకు వినతిపత్రం అందించారు. అనంతరం విద్యార్థులకు పండ్లు, బిస్కెట్లు అందించారు. ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్తలు కొరివి శేషారావు, కొరివి నాగేశ్వరరావు, పింగుల మధు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, పి.భాస్కరరావు, ఉపాధ్యాయులు కె.అరుణ, సిబ్బంది మానికల మంగమ్మ, కొరివి జయమ్మ, తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతోనే బాల్య వివాహాలు నివారణ

ప్రజాశక్తి - ముసునూరు

మండల పరిధిలోని మద్దాయికుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మహిళా అభివృద్ధి, శిశుసంక్షేమ శాఖ జిల్లా వారి ఆధ్వర్యంలో చైల్డ్ లైన్ హెల్ప్ లైన్, లైంగిక వేదిక నుంచి బాలల రక్షణ చట్టం (పొక్సో) 2012, బాల్య వివాహాలు నిషేధంపై విద్యార్థులకు, ప్రధానోపాధ్యాయులు దారపురెడ్డి భాస్కర్‌రావు ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన కల్పించారు. ఆపదలో ఉన్న బాలలకు 1098 ఫోన్ నెంబర్ 24 గంటలకు అందుబాటులో ఉంటుందని బడిబయట పిల్లలు, బాల్య వివాహాలు, బాల కార్మికులు, అనాథ పిల్లలు అత్యాచారానికి గురైన బాలలు, భిక్షాటన చేస్తున్న బాలల హక్కుల కోసం పని చేస్తుందని ఆ సంస్థ ప్రతినిధి వైవి.రాజు విద్యార్థులకు తెలిపారు. సోషల్ వర్కర్స్ సునీత మాట్లాడుతూ బాలలు ఎవరైనా గుడ్, బ్యాడ్, నో టచ్ పట్ల అవగాహన ఉండాలన్నారు. ప్రధానోపాధ్యాయులు దారపురెడ్డి భాస్కరరావు మాట్లాడుతూ విద్యార్థులచే బాల్యవివాహాలు నిషేధం పట్ల అవగాహన తెలిపే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు టిటి భాస్కర్, జై పద్మ, కె.నవ్య, యువ శివ నాగరాజు, బి.జూన్సన్ పాల్గొన్నారు.

అంగన్వాడీ టీచర్లకు 5జీ ఫోన్లు పంపిణీ

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

పట్టణంలోని స్థానిక ఐసిడిఎస్ కార్యాలయంలో శుక్రవారం 28 మంది అంగన్వాడీ టీచర్లకు 5జి చరవాణులను టిడిపి పట్టణ అధ్యక్షులు కొండ్రెడ్డి కిషోర్ అందించారు. చింతలపూడి ఎంఎల్ఎ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించారు. గత ప్రభుత్వంలో ఇచ్చిన ఫోన్లు సరిగా పనిచేయక ఇబ్బందులు ఎదురయ్యాయని, కొత్త కూటమి ప్రభుత్వం ఆధునిక సాంకేతికతతో కూడిన 5జి సామ్‌సంగ్ ఫోన్లు అందించడం హర్షణీయమని అంగన్వాడీ టీచర్లు తెలిపారు. ఈ సందర్భంగా సిఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్, మంత్రి నారా లోకేష్, శిశుసంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి, ఎంపీ పుట్టా మహేష్‌కుమార్, ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిడిపిఒ బ్యూలా, ఇన్‌ఛార్జి సూపర్‌వైజర్ లక్ష్మి రాజ్యం, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.



5జి సెల్‌ఫోన్లతో అంగన్‌వాడీలుఎ

ఎంఎల్ఎ బడేటి చంటికి పలువురి అభినందన

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

టిడిపి జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన ఎంఎల్ఎ బడేటి రాధాకృష్ణయ్య (చంటి)ను కాపు సంఘం చింతలపూడి పట్టణ నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో టిడిపిని బలోపేతం చేయాలని, కాపుల అభివృద్ధికి ఎంఎల్ఎగా, పార్టీ అధ్యక్షుడిగా తమ వంతు కృషి చేయాలని కోరారు. దీనికి స్పందించిన నూతన అధ్యక్షులు తప్పకుండా తన వంతు ప్రయత్నం చేస్తానని, కాపుల అభివృద్ధికి, జిల్లాలో టిడిపిని ముందుకు తీసుకువెళ్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చింతలపూడి శ్రీకృష్ణదేవరాయ పట్టణ కాపు సంక్షేమ సంఘం గౌరవ సలహాదారు కొత్త పూడి శేషగిరిరావు, గౌరవ అధ్యక్షులు తోట శివ నాగరాజు (నాని), అధ్యక్షులు మంచనపల్లి రాఘవేంద్రరావు, సెక్రటరీ ముత్యాల శ్రీనివాస్ (చిన్ని), ట్రెజరర్ తోట పూర్ణచంద్రరావు, కోట శ్రీనివాస్, బొల్లం శంకర్ తదితరులు పాల్గొన్నారు.

తల్లాపురంలో గ్రామసభ

ప్రజాశక్తి - ఉంగుటూరు

మండలంలోని తల్లాపురంలో రీ సర్వే 13 నోటిఫికేషన్ జారీ అయింది. ఈ క్రమంలో శుక్రవారం గ్రామసభ ఏర్పాటు చేశారు. మొత్తం ఆర్ఎస్ నెంబర్ 122లకు ఎసి 625.15 సెంట్లకు రీ సర్వే నిర్వహించగా 421 ఎల్ల పిఎంకు 622.80 సెంట్లు భూమిగా నిర్ధారించారు. డ్రాఫ్ట్ లాండ్ రిజిస్ట్రేషన్‌పై అభ్యంతరాలు ఉంటే ఐదు రోజుల్లో విఆర్ఒలకు దరఖాస్తు చేసుకోవచ్చని తహశీల్దార్ పూర్ణచంద్రప్రసాద్ తెలిపారు.

'భూ సమస్యల పరిష్కారమే జనవాణి లక్ష్యం'

ప్రజాశక్తి - ఉంగుటూరు

కూటమి ప్రభుత్వం నేతృత్వంలో ఉంగుటూరు నియోజకవర్గంలో రెవెన్యూ సంబంధిత సమస్యల పరిష్కారమే ముఖ్య లక్ష్యంగా కృషి చేస్తున్నామని, దీనిలో భాగంగానే ప్రత్యేక జనవాణి కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఉంగుటూరు ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు తెలిపారు. ఉంగుటూరు ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయం వద్ద ఎంఎల్ఎ ఆధ్వర్యంలో రెవెన్యూ శాఖ అధికారుల పర్యవేక్షణలో ప్రత్యేక జనవాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గణపవరం, నిడమర్రు, భీమడోలు, ఉంగుటూరు మండలాల తహశీల్దార్లు, డిప్యూటీ తహశీల్దార్లు, గ్రామాల రెవెన్యూ శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

23న జనవాణి వినియోగించుకోవాలి

టి.నరసాపురం : ఈ నెల 23న స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద జరిగే జనవాణి కార్యక్రమాన్ని ప్రజలు వినియోగించుకోవాలని జనసేన మండల కన్వీనర్ అడపా నాగరాజు శుక్రవారం తెలిపారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలోని 15 పంచాయితీల పరిధిలో ఉన్న గ్రామాల ప్రజల సమస్యలపై పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు ప్రజలనుంచి వినతులు స్వీకరిస్తారని తెలిపారు. ప్రజలందరూ ఈ కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని తెలిపారు.